క్లుప్తంగా

6194 గృహాల సర్వే పూర్తి

లింగంపేట(ఎల్లారెడ్డి): ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం నిర్వహిస్తున్న సర్వే కొనసాగుతుంది. మండలంలోని 41 గ్రామ పంచాయతీల్లోని గ్రామాలు, తండాలకు చెందిన 12,179 మంది ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నట్లు ఎంపీడీవో నరేష్ తెలిపారు. నేటి వరకు 6,194 మంది లబ్ధిదారుల ఎంపిక కోసం సర్వే పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. సర్వే వేగవంతం చేయాలని కార్యదర్శులకు సూచించినట్లు ఆయన పేర్కొన్నారు.

ప్రతిభకు సత్కారం



కామారెడ్డి రూరల్: తెలంగాణ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడి(2024)గా ఎంపికైన కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి బాలుర ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న గణిత శాస్త్ర నిపుణుడు విజయగిరి రామకృష్ణను ఆదివారం తెలంగాణ రాష్ట్ర గణిత ఫోరం ఆధ్వర్యంలో హైదరాబాదులోని హయత్‌నగర్‌లో జరిగిన కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఎస్‌ఈఆర్టీ డైరెక్టర్ రమేష్, ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, టీఎంఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కందికొండ శ్రీనివాస్, కార్యదర్శి వై రామకృష్ణ, గౌరవ అధ్యక్షుడు తాడ్వాయి శ్రీనివాస్, రాష్ట్ర అకడమిక్ కౌన్సిలర్ శ్రీధరాచార్యులు, జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, కార్యదర్శి రామారావు, ఆర్థిక కార్యదర్శి నరేందర్‌లు కలిసి ఘనంగా సన్మానించారు. రామకృష్ణ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని శుభాకాంక్షలు తెలిపారు.

బీజేపీ బూత్ కమిటీలకు అధ్యక్షుల నియామకం



సదాశివనగర్(ఎల్లారెడ్డి): కుప్రియాల్‌లో ఆదివారం బీజేపీ బూత్ కమిటీల అధ్యక్షులను ఎన్నుకున్నట్లు బీజేపీ మండలాధ్యక్షుడు రాంరెడ్డి తెలిపారు. గ్రామంలోని 95, 96, 97 బూత్‌లకు అఖిల్‌రెడ్డి, ఎర్రవాటి సంతోష్, ఆకిటి భూపాల్‌రెడ్డిలను నియమించినట్లు బీజేపీ మండలాధ్యక్షుడు రాంరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ ఉపాధ్యక్షులు చక్రధర్ గౌడ్, స్వరన్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్, జిల్లా కిసాన్ మోర్చ అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, బీజేవైఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రేమ్‌రెడ్డి, జిల్లాల రమేశ్‌రెడ్డి, పోలబోయిన సాయిలు, జైపాల్ రెడ్డి, గంగాధర్ రావు, మండల కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మున్నూరు కాపు యువజన సంఘం అధ్యక్షుడిగా నేరెళ్ల నాగరాజు



రామారెడ్డి: మున్నూరు కాపు యువజన సంఘం మండల అధ్యక్షుడిగా రామారెడ్డి గ్రామానికి చెందిన నేరెళ్ల నాగరాజును ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మండల అధ్యక్షుడు కడెం శ్రీకాంత్ తెలిపారు. ప్రధాన కార్యదర్శిగా గోపు రంజిత్, కోశాధికారిగా ఆకుల సురేష్, మండల్ కో-ఆర్డినేటర్‌గా సుధాకర్, గౌరవ అధ్యక్షులుగా పలికల నరేష్‌ను ఎన్నుకున్నారు. ఈ కమిటీని రామారెడ్డి మున్నూరు కాపు సంఘం మండల అధ్యక్షుడు కడెం శ్రీకాంత్ ఆధ్వర్యంలో నియమించారు. నాగరాజు మాట్లాడుతూ.. మున్నూరు కాపుల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. మండల సెక్రెటరీ కాల హనుమాన్లు, స్వామి, బండి లింగం, బండారు చంద్రశేఖర్, శంకర్, పాలికల కృష్ణ పాల్గొన్నారు.

రోడ్డు వెడల్పులో తొలగించే చెట్ల గుర్తింపు



పిట్లం(జుక్కల్): పిట్లం– బాన్సువాడ రహదారి రోడ్డు వెడల్పు పనులలో భాగంగా తొలగించే చెట్లను ఆదివారం ఫారెస్ట్ అధికారులు గుర్తించి మార్కింగ్ వేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ రఘుపతి స్వామి మాట్లాడుతూ.. మండలంలోని కుర్తి గేట్ నుంచి సిద్దాపూర్‌తండా వరకు 1.9 కిలోమీటర్ పరిధిలో రోడ్డుకు రెండు వైపులా కలిపి మొత్తం 294 చెట్లను తొలగిస్తున్నట్లు తెలిపారు. ఈ నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామన్నారు. ఫారెస్ట్ సిబ్బంది గయాజ్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానం కోసం విరాళం

బాన్సువాడ: పట్టణంలోని అయ్యప్ప ఆలయం వద్ద నిర్వహించే నిత్యాన్నదానం కోసం బాన్సువాడకు చెందిన బెజుగం మాణిక్యం గుప్తా రూ.1,11,116 లను ఆలయ ట్రస్ట్ సభ్యులకు విరాళంగా అందజేశారు. పదేళ్లుగా అయ్యప్ప ఆలయం వద్ద నిత్య అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. నిత్య అన్నదానం కోసం తమ వంతు సహకారం అందించేందుకు దాతలు ముందుకు వస్తున్నారని ట్రస్ట్ సభ్యులు శంకర్, గురువినయ్ తెలిపారు.

శిథిలావస్థలో పశువైద్యశాల

- బిక్కుబిక్కు మంటూ పశువులకు సేవలందిస్తున్న వైద్య సిబ్బంది
- ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి
- సొంత భవనం స్థలంలో గ్రంథాలయం నిర్మాణం
- పాత గ్రామ పంచాయతీలో కాలం వెల్లదీస్తున్న వైనం
- పక్కా భవనం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్న సిబ్బంది



శిథిలావస్థలో ఉన్న బీబీపేట పశువైద్యశాల



ఇనుప చువ్వలు తేలిన శ్లాబు



వర్షపు నీటికి తడిసిన మందులు, ఇతర సామగ్రి

బీబీపేట : మండలంలోని పశువైద్యశాల భవనం శిథిలావస్థకు చేరడంతో సిబ్బంది ప్రాణాలు అరచేతిలో పట్టుకొని సేవలు అందిస్తున్నారు. పాత భవనం స్థలంలో నూతన గ్రంథాలయం భవనాన్ని నిర్మించడంతో పశువైద్యశాలను పాత గ్రామ పంచాయతీ భవనానికి మూడేళ్ల కిందట తరలించారు. దీంతో అప్పటికే శిథిలావస్థకు చేరి ఎప్పుడు కూలుతుందో తెలియని స్థితిలో పాత గ్రామ పంచాయతీ భవనం ఉండడంతో సిబ్బంది బయట కూర్చొనే సేవలు అందించాల్సిన పరిస్థితి నెలకొంది. మందులు, వైద్య సామగ్రి ఎక్కడ ఉంచాలో తెలియక అవస్థలు పడుతున్నారు. ఆస్పత్రి పైకప్పు పూర్తిగా ఇనుప చువ్వలు తేలి వేలాడుతున్నాయి.

ఇప్పటికీ 50 ఏళ్ల క్రితం నాటి భవనంలోనే..

మండల కేంద్రంలో 50 ఏళ్ల క్రితం నిర్మించిన పాత గ్రామ పంచాయతీ భవనంలోనే పశువైద్యశాల కొనసాగుతోంది. పదేళ్ల నుంచి ఆ భవనం పూర్తిగా శిథిల దశకు చేరుకుంది. పైకప్పు ముట్టుకుంటే ఊడిపోయేటట్లు ఉంది. ఈ పశువైద్యశాలన 11 గ్రామాల రైతులకు సేవలందిస్తోంది. మందులు, ఇతర వస్తువులు వర్షపు నీటికి తడిసి పనికి రాకుండా పోతున్నాయి. గత్యంతరం లేని పరిస్థితిలో పశువైద్య సేవలు ఇందులో కొనసాగించాల్సి వస్తోంది. కనీసం అయిదు నిమిషాలు కూర్చొని రైతులకు వివరాలు చెబుదామంటే కూడా పైపెచ్చులు ఊడి తలల పగిలే అవకాశం ఉంది.

స్థలం కేటాయింపు..

బీబీపేట పశువైద్యశాల సొంత భవనం నిర్మాణం కోసం 8 ఏళ్ల క్రితం పంచాయతీ పాలకులు వారాంతపు సంత వద్ద 500 గజాల స్థలం కేటాయించారు. కానీ నిర్మాణానికి ప్రభుత్వం నిధులు కేటాయించడం లేదు. 11 గ్రామాలకు సేవలందించే పశువైద్యశాల భవనం వైపు కన్నెత్తి కూడా చూడకుండా నిమ్మకు నీరెత్తినట్లు అధికార యంత్రాంగం వ్యవహరిస్తోందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు పశువైద్యశాల శాశ్వత భవన నిర్మాణంపై దృష్టి సారించి నిధులు మంజూరయ్యేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

మహిళా సిబ్బంది అవస్థలు..

పశువైద్యశాలలో పని చేస్తున్నటువంటి మహిళా సిబ్బంది ఒంటికి, రెంటికి పోవాలంటే ఉక్క పట్టుకోవాల్సిందే. మరుగుదొడ్లు లేకపోవడంతో మహిళా ఉద్యోగిని ఎవరికి చెప్పుకోలేని పరిస్థితిలో ఉన్నారు. మండల పశువైద్యురాలుగా మహిళా ఉద్యోగి ఉండటం, ఆమె పరిస్థితిపై చాలాసార్లు ఉన్నతాధికారులకు విన్నవించినప్పటికీ పట్టించుకున్న పాపాన పోలేదు.

ఉన్నతాధికారులకు నివేదించాం

పశువైద్యశాల శిథిలావస్థకు చేరుకుందని గతంలో కూడా చాలా సార్లు నివేదికలు అందించాం. ఇక్కడ విధులు నిర్వర్తించడమంటే ప్రాణాలు అర చేతిలో పెట్టుకొని పని చేయాలి. ఎప్పుడు ఎటు పక్క నుంచి ఏ ప్రమాదం సంభవిస్తుందో అని భయంగా ఉంటుంది. ప్రభుత్వం నిధులు మంజూరు చేసి నూతన భవనం నిర్మించాల్సిన అవసరం ఉంది.

– హేమశ్రీ, ఇన్‌చార్జి పశువైద్యులు, బీబీపేట

బీఆర్‌ఎస్‌లో కాంగ్రెస్, బీజేపీ నాయకుల చేరిక



పార్టీలో చేరిన కాంగ్రెస్, బీజేపీ నాయకులతో మాజీ ఎమ్మెల్యే సురేందర్

ఎల్లారెడ్డిరూరల్/నాగిరెడ్డి : ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ సమక్షంలో కాంగ్రెస్, బీజేపీలకు చెందిన నాయకులు ఆదివారం బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఎల్లారెడ్డి పట్టణంలోని సురేందర్ ఫాంహౌజ్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో నాగిరెడ్డిపేట మండలంలోని వాడి గ్రామానికి చెందిన నాయకులు చందర్, అశోక్, కిష్టయ్య, హనుమంతు, సాయిలు, చిన్నసాయిలుతో పాటు పలువురు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈసందర్భంగా సురేందర్ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ అభివృద్ధికి కృషి చేయాలని, అన్నివిధాలా తాను అండగా ఉంటానని హామీ ఇచ్చారు. బీఆర్‌ఎస్ మండల, పట్టణ అధ్యక్షుడు జలంధర్‌రెడ్డి, సతీష్, నాగం సురేందర్, అరవింద్ తదితరులున్నారు.

ప్రమాదబీమా చెక్కుల పంపిణీ



ఎల్లారెడ్డి/రాజంపేట: విద్యుత్ ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు ప్రమాదబీమా చెక్కులను ఆదివారం పంపిణీ చేశారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో విద్యుత్‌శాఖ తరపున మంజూరైన రూ.5 లక్షల ప్రమాదబీమా చెక్కులను బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సాయిబాబా, వినోద్‌గౌడ్, నాయకులు తిరుపతి, ఆరీఫ్, గఫార్, షెకావత్ తదితరులున్నారు.

ఘనంగా మల్లికార్జున సట్టి పండుగ



పిట్లం(జుక్కల్): కంబాపూర్‌లో ఆదివారం మల్లికార్జున సట్టి పండుగను గ్రామస్తులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన



సదాశివనగర్(ఎల్లారెడ్డి): లింగంపల్లిలో ఆదివారం ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. సీతారాముల విగ్రహాల ఊరేగింపు, శిఖర ప్రతిష్ఠ, అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. గ్రామ పెద్దలు, యువజన సంఘాల సభ్యులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం..

వైభవంగా మల్లన్న బోనాల ఊరేగింపు



గాంధారి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో నిర్మించిన మల్లికార్జున స్వామి మందిర వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఆదివారం యాదవులు ప్రతి ఇంటి నుంచి బోనాలు తీసుకొని మందిరం వరకు ఊరేగించారు. మల్లికార్జున స్వామికి సమర్పించారు. ఉగ్గ కళాకారులతో సంప్రదాయ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. నాలుగు రోజుల పాటు వేడుకలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

కొనసాగుతున్న మల్లన్న ఉత్సవాలు



కామారెడ్డి రూరల్: దేవునిపల్లి గ్రామంలో మల్లన్న ఉత్సవాలు రెండో రోజు వైభవంగా కొనసాగుతున్నాయి. మల్లన్న జాతర ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం నుంచి పలు కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామస్తులందరూ ఉత్సవాల్లో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. వీడీసీ అధ్యక్షుడు గుడెల్లి గంగారాం, ఉపాధ్యక్షులు వంగ రాహుల్ కుమార్, నిట్టు లింగారావు, ప్రధాన కార్యదర్శి ద్యావరి నవీన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నేడు అగ్ని గుండాలు.. స్వామివారి కల్యాణోత్సవం

మల్లన్న ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం 6 గంటలకు అగ్ని గుండాలు తొక్కడం, మధ్యాహ్నం మల్లన్న, మేడాలమ్మ, గొల్లకేతాలమ్మ కల్యాణోత్సవం, 24న బోనాలు, ఎడ్లబండ్ల ఊరేగింపు కార్యక్రమాలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు, 25న చక్కెర తీర్థం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వీడీసీ ప్రతినిధులు తెలిపారు

సంక్షిప్తం

వెంకటస్వామికి నివాళులు

కామారెడ్డి క్రైం: కేంద్ర మాజీ మంత్రి గడ్డం వెంకటస్వామి వర్ధంతిని ఆదివారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. వెంకటస్వామి చిత్రపటానికి అదనపు కలెక్టర్ విక్టర్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కలెక్టరేట్ సూపరింటెండెంట్ జ్యోతి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బాన్సువాడ రూరల్/బాన్సువాడ: బోర్లంలో మాల మహానాడు సంఘం ఆధ్వర్యంలో వెంకటస్వామి వర్ధంతి నిర్వహించారు. నాయకులు గుజ్జరి గంగారాం, జగ్గ ఆనంద్, రంజీత్, నెర్రె నర్సింహులు, తదితరులు పాల్గొన్నారు.

పెద్దచెరువు నీరు విడుదల

భిక్కనూరు: జంగంపల్లి గ్రామ పెద్ద చెరువు నీటిని ఆదివారం విడుదల చేశారు. ఆయకట్టులో రైతులు సాగు చేసిన వరి పంట కోసం ఈ నీటిని వదిలారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నర్సింలు యాదవ్, డీసీసీబీ డైరెక్టర్ సిద్దరాములు, వైస్ చైర్మన్ వాసు యాదవ్, వీడీసీ అధ్యక్షుడు శివలింగం, నేతలు రాములు, రమేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

తాడ్వాయిలో వాహనాల తనిఖీ

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని కామారెడ్డి –ఎల్లారెడ్డి ప్రధాన రహదారిలో ఆదివారం పోలీసుల ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. సీటు బెల్టులు పెట్టుకోని, హెల్మెట్లు ధరించని వారికి, డాక్యుమెంట్లు లేనివారికి జరిమానా విధించారు. పెండింగ్‌లో చలాన్లు ఉన్న వాహనాలకు ఆన్‌లైన్‌లో డబ్బులు కట్టేలా చర్యలు తీసుకున్నారు.

నేడు తాడ్వాయిలో ప్రజావాణి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): స్థానిక తహసీల్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తహసీల్దార్ రహిమొద్దీన్ తెలిపారు. ఈ ప్రజావాణి ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కొనసాగుతుందని, ఈ కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు హజరవుతారన్నారు. ఏమైనా సమస్యలు ఉన్నట్లయితే ఈ ప్రజావాణిలో ఫిర్యాదు చేసుకోవచ్చని తెలిపారు.

మైసమ్మ ఆలయంలో భక్తుల సందడి

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండలంలోని మైలారంలో గల కొచ్చెరి మైసమ్మ ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యుల అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి కొబ్బరి కాయలు కొట్టి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

నేడు 'గాయత్రి'లో 'సాయిబాబా' వార్షికోత్సవం

సదాశివనగర్(ఎల్లారెడ్డి): అడ్లూర్‌ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఆవరణలో గల షిర్డి సాయిబాబా ఆలయ 12వ వార్షికోత్సవం నిర్వహించనున్నట్లు ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్ రావు తెలిపారు. ఉదయం అభిషేకాలు, అర్చనలు, అనంతరం అన్నదానం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

భైరవ స్వామి ఆలయ వార్షికోత్సవం

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి పట్టణంలోని కాలభైరవ వీరాంజనేయ స్వామి ఆలయం 36వ వార్షికోత్సవం సోమవారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. భక్తులు హాజరై విజయవంతం చేయాలని ప్రతినిధులు కోరారు.

విద్యుత్ ఫీడర్ ప్రారంభం



రామారెడ్డి: రామారెడ్డి సబ్ స్టేషన్‌లో ఆదివారం నూతన విద్యుత్ ఫీడర్ బ్రేకర్‌ను ప్రారంభించారు. గతంలో ఒకే ఫీడర్ ఉండడంతో ఏదైనా సమస్య తలెత్తి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే అందరు రైతులు ఇబ్బందిపడేవారు. కొత్త ఫీడర్ బ్రేకర్‌తో ఆ సమస్య తీరినట్లయ్యిందని ఏఈ నరసింహ తెలిపారు. కార్యక్రమంలో రామారెడ్డి విద్యుత్ శాఖ ఏఈ లక్ష్మీనరసింహ, లైన్ ఇన్‌స్పెక్టర్ ఏసురత్నం, లైన్‌మన్‌లు కైలాష్, మోహన్‌సింగ్, ఏఎల్‌ఎంలో మీరా, రమేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రత్యేక అధికారితో విచారణ జరిపించాలి



మాట్లాడుతున్న వీఎల్ నర్సింహారెడ్డి

కామారెడ్డి టౌన్: మున్సిపల్‌లో జరుగుతున్న అవినీతిపై కలెక్టర్ స్పందించి ప్రత్యేక అధికారితో విచారణ జరిపించాలని సీపీఐ రాష్ట్ర నాయకుడు వీఎల్. నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఏళ్ల తరబడి పేరుకుపోయిన మున్సిపల్ పాత సామగ్రిని 10న రాత్రి దొంగతనంగా ఎత్తుకెళ్లి రూ.8 లక్షలకు అమ్ముకున్న అధికారిని తక్షణమే సస్పెండ్ చేసి డబ్బులను బల్దియా ఖాతాలో జమ చేయాలన్నారు. మున్సిపల్‌లో డబ్బులు లేక 3 నెలలుగా కార్మికులకు వేతనాలు ఇవ్వడం లేదు కానీ మరోవైపు ఇలా ప్రజాసొత్తును కాజేస్తున్నారని ఆరోపించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎల్. దశరథ్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు పి. బాలరాజు, నాయకులు దేవయ్య, ఈశ్వర్, మల్లేష్ తదితరులున్నారు.

ఆదివారం ఆస్పత్రి తెరవరా సారూ..!



మూసి ఉన్న రాజంపేట పీహెచ్‌సీ

రాజంపేట: రాజంపేట పీహెచ్‌సీ కొంత కాలంగా ఆదివారం రోజున తెరవడం లేదు. దీంతో రోగులు ఆదివారం ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించాల్సి వస్తోంది. రాజంపేట మండల కేంద్రంలోని ఆస్పత్రి 12 గంటలు సేవ అందించే కేటగిరి కింద వస్తుంది. సెలవు రోజుల్లో కాకుండా ప్రతి ఆదివారం ఆస్పత్రి ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు సేవలు అందించాల్సి ఉంటుంది. కానీ కొంత కాలంగా ఆదివారం సేవలు అందించడం లేదు. అధికారులు స్పందించి ఆదివారం రోజు కూడా సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయంపై మెడికల్ ఆఫీసర్ విజయ మహాలక్ష్మిని సాక్షి వివరణ కోరగా.. తమ ఆస్పత్రిలో కొంతకాలంగా రెగ్యులర్ స్టాఫ్‌నర్స్ లేకపోవడంతో ఆదివారం రోజుల్లో సేవలు అందించలేకపోయామన్నారు. ప్రస్తుతం రెగ్యులర్ స్టాఫ్ నర్స్ అందుబాటులో ఉందని ఇక నుంచి ప్రతి ఆదివారం సేవలు అందిస్తామని తెలిపారు.



వీధుల్లో మురికి నీటి ప్రవాహం



సంగం గ్రామ ప్రధాన దారి ప్రవహిస్తున్న మురికి నీరు

సంగం గ్రామంలో ప్రధాన రహదారి వెంట మురికి నీరు ప్రవహిస్తోంది. ఆ దారిలో నడవాలంటే ముక్కు మూసుకుని నడవాల్సిందే. రోడ్డు విస్తరణ పనులు మధ్యలో నిలిచిపోవడంతో మురికి నీరు వీధుల్లో చేరి దుర్గంధం వ్యాపిస్తోంది. పంచాయతి సిబ్బంది పట్టించుకోకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది.

– నస్రుల్లాబాద్(బాన్సువాడ)

గణిత ప్రతిభా పరీక్షలో ద్వితీయ బహుమతి



బహుమతి అందుకుంటున్న జాహెద్



గణిత పటాలను చూపుతున్న విద్యార్థులు

బాన్సువాడ రూరల్/కామారెడ్డి టౌన్: గణిత శాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని ప్రతి ఏటా డిసెంబర్ 22న నిర్వహించే గణిత దినోత్సవం సందర్భంగా ఈ ఏడాది గణిత ప్రతిభా పరీక్ష నిర్వహించారు. పరీక్షలో బోర్లం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థి జాహెద్ రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానం సాధించాడు. తెలంగాణ గణిత ఫోరం ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లో జాహెద్‌ను ఘనంగా సన్మానించి బహుమతి అందజేశారు. విద్యార్థి జాహెద్‌తో పాటు ప్రోత్సహించిన గణిత ఉపాధ్యాయుడు పద్మ శ్రీనివాస్‌లను పాఠశాల హెచ్‌ఎం సరఫ్ వెంకటరమణ అభినందించారు. గణిత ఫోరం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు తాడ్వాయి శ్రీనివాస్, ఫోరం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వేణుగోపాల్, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

రామానుజన్‌కు నివాళులు

కామారెడ్డి అర్బన్: జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా పట్టణ పరిధిలోని దేవునిపల్లి వివేకా వరిని పాఠశాలలో గణితంతో చేసిన వివిధ చిత్రాలను ప్రదర్శించారు. గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు జి.రామకృష్ణ, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం..

తిప్పాపూర్ ఎమ్మార్పీఎస్..



భిక్కనూరు : తిప్పాపూర్ ఎమ్మార్పీఎస్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పసిగాళ్ల భరత్‌రాజు, ప్రధాన కార్యదర్శిగా శ్యామార్తి రజినీకాంత్, ఉపాధ్యక్షులుగా దీపరాజు, కాశీగల్ల మహేష్, కార్యదర్శిగా ఇల్లందుల సురేష్, సోషల్ మీడియా ఇన్‌చార్జిగా భూంపల్లి రాజేందర్, కార్యవర్గ సభ్యులుగా నారిగాళ్ల బాబు, బర్కం లక్ష్మణ్, చాట్లపల్లి సుమంత్, గోసు రాము, గోసు స్వామి, సతీష్, జగదీష్‌లు ఎన్నికయ్యారు. మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు కర్రోళ్ల రాజు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు.

సరంపల్లి మున్నూరుకాపు సంఘం..



కామారెడ్డి అర్బన్: పట్టణ పరిధిలోని సరంపల్లి గ్రామ మున్నూరుకాపు పటేల్ సదర్ సంఘం అధ్యక్షుడిగా బక్కన్నగారి రాజశేఖర్, ఉపాధ్యక్షుడిగా సంగిశెట్టి రాజు, కార్యదర్శిగా మామిండ్ల రాజయ్య, ఉప కార్యదర్శిగా గైనబోయిన శేఖర్, కోశాధికారిగా ముల్క శ్రీనివాస్, సలహాదారులుగా మామిండ్ల లింగం, ఆకుల కృష్ణ, కార్యవర్గ సభ్యులుగా మామిండ్ల రవి, నితిన్, పెద్ద అంజయ్య, బక్కనగారి అనిల్, ఆకుల అంజయ్య, సంగిశెట్టి అనిల్, పొన్నాల భూమయ్యలు ఎన్నికయ్యారు.

ముమ్మరంగా చెరకు క్రషింగ్

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ ముమ్మరంగా కొనసాగుతుంది. శనివారం నాటికి లక్షా 30 వేల 280 టన్నుల క్రషింగ్ జరిగినట్లు ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్ రావు తెలిపారు. పర్మిట్ల ఆధారంగా చెరుకును గానుగకు తరలిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.